పక్కాగా వంద రోజుల ప్రణాళిక : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

పదో తరగతి పరీక్షల్లో జిల్లా ఉత్తమ ఫలితాలు సాధించేలా వంద రోజుల ప్రణాళిక ను పక్కాగా అమలుచేయాలని కలెక్టర్ రాఃమసుందరరెడ్డి ఆదేశించారు. పిజిఆర్ఎస్‌లో వినతులు స్వీకరణ అనంతరం ఆయన అధికారులతో సమీక్షించారు. జిల్లాలోని 297 పాఠశాలల్లో 16,240 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలకు హాజరవుతున్నారని అన్నారు. వీరంతా ఉత్తీర్ణులయ్యేలా చూసే బాధ్యత అధికారులదేనని అన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్నారు. పిజిఆర్ఎస్ వినతులు అర్జీదారులు సంతృప్తి స్థాయి పెరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. వినతుల ఆడిట్ పెండింగ్‌లేకుండా చూడాలన్నారు. మండల ప్రత్యేకాధికారులు, ఆర్‌డిఒలు, మున్సిపల్ కమిషనర్లు వారంలోనాలుగు రోజులు సచివాయాలను తప్పనిసరిగా సందర్శించాలని తెలిపారపు. సమావేశంలో సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్, డిఆర్ఒ మురళి, జిల్లా అధికారులు, వర్చువల్‌గా మండల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేయొద్దు

- రద్దు బిల్లును ఉపసంహరించుకోవాలి
- పలుచోట్ల వామపక్షాల ధర్నాలు

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వామపక్ష నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మహాత్మాగాంధీ పేరు మీద ఉన్న జాతీయ హామీ చట్టం బిల్లు రద్దును ఉపసంహరించుకోవాలని వామపక్షాలు డిమాండ్ చేశాయి. సోమవారం వామపక్షాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, సిపిఎం ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి బెహరా శంకరరావు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడిచి కూలీలకు ఉపాధి లేకుండా మోదీ ప్రభుత్వం పన్నాగం పన్నిందన్నారు. ఉపాధి హామీలో ఉండే హక్కులను కాలరాసేందుకే జాతీయ ఉపాధి హామీ చట్టంలో గాంధీజీ పేరు తొలగించి పథకంగా మార్చారని అన్నారు. గాంధీజీ మీద ఉన్న వ్యతిరేకతతోనే ఉపాధి హామీ చట్టానికి బిజెపి ప్రభుత్వం తూట్లు పొడుస్తుందని ఆరోపించారు. బిజెపి అధికారంలోకి వచ్చిన మొదటినుండి కూడా ఈ ఉపాధి హామీ చట్టంపై దాడి చేస్తుందని అన్నారు. పార్లమెంట్‌లో వారికి ఉన్న మెజారిటీతో ఈనాటికి కూలీలకు హక్కుగా ఉన్న చట్టాన్ని మార్చి ఉపాధికి గ్యారంటీ లేకుండా చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకానికి 90శాతం నిధులు ఇచ్చే కేంద్ర ప్రభుత్వం ఆ నిధులను 60 శాతానికి కుదించిందని, దీనివల్ల ఆ భారం రాష్ట్రాలపై పడుతుందని అన్నారు. అయినప్పటికీ కూటమిలోని టిడిపి, జనసేన పార్టీలు కేంద్రానికి వ్యతిరేకంగా నోరు మెదపడం లేదన్నారు. ఇప్పటికైనా టిడిపి, జనసేన స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ చట్టాన్ని మార్చడం వల్ల గ్రామీణ పేదలు కూలీలు తీవ్రంగా నష్టపోతారని, గతంలో ఉపాధి చట్టం రూపు దాల్చడం వల్ల 20 ఏళ్ల కాలంలో ప్రజలకు మేలు జరిగిందన్నారు. గ్రామీణ ఉపాధి చట్టాన్ని ఉన్నఫలంగానే కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు, కమిటీ సభ్యులు గొర్లి .శ్రీనివాసరావు, ఎజజగన్మోహన్, పి.రమణమ్మ, బి.రమణ, సిపిఐ నాయకులు బుగత అశోక్, పురం అప్పారావు, రంగరాజు, లిబరేషన్ పార్టీ నాయకులు అప్పలరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బొబ్బిలి : ఉపాధి హామీ చట్టం పేరు మార్పునకు వ్యతిరేకంగా సోమవారం బొబ్బిలి పట్టణంలోని గాంధీ సెంటర్ వద్ద వామపక్షాల ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వామపక్ష నాయకులు పి.శంకరరావు, ఎం.శ్రీనివాస్, వి.రామ్మూర్తి మాట్లాడుతూ కేంద్రం తెచ్చిన విబి- జి రామ్ జి చట్టంతో రాష్ట్రాలపై పెనుభారం పడనుందన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నిండా అప్పుల్లో మునిగిపోయి ఉందని చెప్పారు. ఇప్పుడు కొత్త చట్టం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులను ఈ పథకానికి కేటాయించాల్సి ఉందని, అది సాధ్యమయ్యే పరిస్థితి లేదని తెలిపారు. చివరికి పేదలను ఉపాధి హామీకి దూరం చేసి, నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కుట్ర పన్నిందని విమర్శించారు. తక్షణమే ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు గొల్లపల్లి తౌడు, పాలూరి కృష్ణ, సింగిరెడ్డి గోపాల్, ఎంపల బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : ఉపాధి హామీ పథకంలో గాంధీ పేరు తొలగించడం దారుణమని సిపిఎం, సిపిఐ నాయకులు కిల్లంపల్లి రామారావు, మొయిద పాపారావు అన్నారు. సోమవారం స్థానిక మొయిద జంక్షన్‌లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు పరిచి దాని స్థానంలో జిరామ్ చట్టాన్ని తీసుకు రావడానికి వ్యతిరేకిస్తూ వామపక్ష పార్టీలు ఇచ్చిన పిలుపు మేరకు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రద్దు చేసి జి రామ్ చట్టాన్ని తీసుకు రావడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు మన్యపురి సన్యాసిరావు, సంకురుబోతు సూర్యారావు, కొయ్యాన సాదుబాబు, సురాల ఆదినారాయణ, సిపిఐ నాయకులు పి.సూరి, ప్రభాకర్, కాంగ్రెస్ నాయకులు కనకల పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

గాంధీ పేరు మార్పుపై నిరసన

విజయనగరం టౌన్ : కూలీల ఉపాధి కోసం తీసుకువచ్చిన మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేరు మార్చడం శోచనీయమైందని, వెంటనే పేరు మార్పు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని గాంధీ స్మారక నిధి పట్టణ అధ్యక్షులు కర్రోతు సత్యం అన్నారు. సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షులు సత్యం, ప్రధాన కార్యదర్శి మజ్జి కాంతారావు, ఉపాధ్యక్షులు ఏడిద వీర్రాజు, రొంగలి ఎర్నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న ప్రజావ్యతిరేక విధానాలను ఆపాలని, తక్షణమే పార్లమెంటులో ప్రవేశపెట్టిన జి రామ్ జి ఉపాధి హామీ పథకం పేరుపై పునః సమీక్ష చేయాలని కోరారు. కార్యక్రమంలో ఈపు విజయ కుమార్, పెద్దింటి అప్పారావు, గిడుతూరి పైడితల్లి పాల్గొన్నారు.

బొబ్బిలి, నెల్లిమర్లలో ధర్నాలు చేస్తున్న వామపక్ష నాయకులు, కార్యకర్తలు

శిక్షణ ప్రారంభంలో మాట్లాడుతున్న డిఐజి గోపినాథ్ జెట్టి

కానిస్టేబుల్ పాత్ర కీలకం

డిఐజి గోపినాథ్ జెట్టి ● కానిస్టేబుళ్ల శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి- డెంకాడ

పోలీసు వ్యవస్థలో కానిస్టేబుల్ పాత్ర అత్యంత కీలకమని డిఐజి గోపినాద్ జెట్టి అన్నారు. స్థానిక 5బెటాలియన్‌లో సోమవారం నూతన కానిస్టేబుళ్లకు శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలతో ప్రత్యక్ష సంబంధం కలిగిన తొలి స్థాయి పోలీసు అధికారి కానిస్టేబుల్ అన్నారు. శిక్షణ కాలంలో అంకిత భావంతో, క్రమశిక్షణతో నైతిక విలువలతో కూడిన శిక్షణను పూర్తిగా పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్ వై.రవిశంకర్‌రెడ్డి, పోలీసు అధికారులు పద్మనాభరాజు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టిసారించాలి

కంటోన్మెంట్ : దేశంలో జరుగుతున్న సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని విశాఖ నగర కమిషనర్ సంఖబ్రత్ బాగ్చి అన్నారు. స్టయిఫండరీ క్యాడెట్ ట్రైనీ మహిళా స్టేబుల్స్ (సివిల్) 9 నెలల శిక్షణ సోమవారం పిటిసిలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన కమిషనర్ సంఖబ్రత్ బాగ్చ్ జ్యోతి వెలిగించి శిక్షణను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శిక్షణ కాలంలో పాటించాల్సిన శిక్షణ నియమాలు, సైబర్ క్రైమ్‌ను అరికట్టడంలో పోలీసుల పాత్ర గురించి వివరించారు. వృత్తి వ్యక్తిగత జీవితంలో రాణించేందుకు కావాల్సిన మెళకువలను అందించారు. పిటిసి ప్రిన్సిపాల్ డి.రామచంద్రరావు మాట్లాడుతూ శిక్షణ కానిస్టేబుళ్లకు కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలు గురించి వివరించారు. గతమూడు నెలల్లో ప్రజాప్రతినిధులు, కలెక్టర్ సహాయ సహకారాలతో వసతి, సౌకర్యాలు మెరుగపర్చేందుకు చేసిన కృషిని కమిషనర్ అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పివి అప్పారావు, డిఎస్‌పిలు పి.శ్రీకాంత్, ఎం.మహేష్, టి.రమేష్, మెడికల్ ఆఫీసర్ ఉదయకుమార్, ఎఒ టి.భవాని, సిఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

సత్య కళాశాల విద్యార్థులకు పతకాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో కోచ్ సంతోష్ ఆధ్వర్యంలో కరాటే లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు ఇటీవల విశాఖపట్నం గాజువాకలో జరిగిన 19వ కెన్యూ రియో కరాటే ఛాంపియన్‌షిప్ లో బాలబాలికలు విజయం సాధించారు. కాటా, కుంటి విభాగాల్లో సిహెచ్ రిషిత - బంగారు, కాంస్య పతకం, పి.హర్షవర్ధన్ - రెండు బంగారు పతకాలు, ఎం . యోగిత, పి.గురుసిద్ధిక్, ఎస్.శ్రీవత్సల్ – రజిత, బంగారు పతకాలు , ఎన్. దేవన్ష్ - బంగారు, కాంస్య పతకాలు, ఎస్.నవ్య - బంగారు, రజిత పతకాలు, కె.ప్రేమేష్, బి.లేవాన్ - కాంస్య, బంగారు పతకాలు, ఎన్. జననీ - రెండు రజిత పతకాలు, వి. ఇందిరా ప్రియ దర్శిని, పి.గగన్‌సాయి - కాంస్య, రజిత పతకాలు, జి.వివేక్ వర్మ – రెండు రజిత పతకాలు, మహమ్మద్ సమీర్, ఎం.హర్షవర్ధన్, కె.శివ గణేష్, కె.తనుశ్రీ – కాంస్య, రజిత పతకాలు,. పి కుష్వంత్ కుమార్ - రెండు రజిత పతకాలు సాధించారు. ఈ సందర్భంగా సత్య కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం శశి భూషణ రావు విద్యార్థులకు అభినందనలు తెలుపుతూ కరాటే లో ఇంకా రాణించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వి సాయి దేవ మణి, కోచ్ కె.సంతోష్ కుమార్, అసిస్టెంట్ కోచ్ భార్గవ్ పాల్గొన్నారు.

అదానీ స్మార్ట్‌మీటర్లు వద్దు

అడ్డుకున్న గాంధీనగర్ వాసులు

ప్రజాశక్తి-కొత్తవలస

అదానీ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును కొత్తవలసలోని గాంధీనగర్‌లో సిపిఎం ఆధ్వర్యాన స్థానికులు అడ్డుకున్నారు. సోమవారం గాంధీనగర్ అంగన్వాడీ కేంద్రంతోపాటు పలు ఇళ్లకు స్మార్ట్‌మీటర్లను బిగించేందుకు సిబ్బంది చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న సిపిఎం జిల్లా నాయకులు గాడు అప్పారావు అక్కడికి చేరుకున్నారు. స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేసుకోవాలని ఒత్తిడి తెస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. స్మార్ట్‌మీటర్లతో బిల్లుల్లో వ్యత్యాసం వస్తుందని, ఛార్జీలు ఎక్కువగా వసూలు చేస్తున్నారని తెలిపారు. పాత మీటర్లే కొనసాగించాలని డిమాండ్ చేశారు. స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో స్మార్ట్‌మీటర్లను ఏర్పాటు చేయకుండా సిబ్బంది అక్కడి నుంచి వెనుదిరిగారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు సిహెచ్ జగన్ పాల్గొన్నారు.

స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును అడ్డుకుంటున్న సిపిఎం నాయకులు

లాభాపేక్షతోనే నాన్నమ్మను చంపిన మనుమడు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

భోగాపురం మండలం ముడసలపేటలో ఈనెల 12న జరిగిన హత్యకేసును భోగాపురం పోలీసులు ఛేధించి, వృద్ధురాలిని హత్యచేసిన నిందితుడు (మనుమడు) ముడసల గౌరి (27)ను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. అతని నుంచి 18.250 గ్రాముల బంగారు వస్తువులు, 106 గ్రాముల వెండి పట్టీలను రికవరీ చేశారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వివరాలను ఎస్‌పి ఎఆర్ దామోదర్ వెల్లడించారు.

ముడసల పేటకు చెందిన ముడసల అప్పయ్యమ్మ (70)ను గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసి, బంగారు, వెండి ఆభరణాలను దొంగిలించినట్లు కోడలు ముడసల లక్ష్మి ఈనెల 13న పోలీసులకు ఫిర్యాదు చేసింది. డిఎస్‌పి ఆర్.గోవిందరావు ఆధ్వర్యాన భోగాపురం సిఐ కె.దుర్గాప్రసాద్, ఎస్ఐ పి.పాపారావు, సిసిఎస్ ఎస్ఐ కె.లక్ష్మణరావు ఆధ్వర్యాన బృందాలుగా ఏర్పడి కేసు విచారణ చేపట్టారు. నేర స్థలం పరిశీలన సమయంలో డాగ్ స్క్వాడ్ నిందితుడు ముడసల గౌరి చుట్టూ తిరగడంతో పోలీసులకు అతనిపై అనుమానం వచ్చి నిఘాపెట్టారు. సంఘటన జరిగి కొద్దిరోజులు కావడం, పోలీసులకు తనపై అనుమానం లేదని భావించి దొంగిలించిన వస్తువులను అమ్మేసేందుకు వెళ్తుండగా భోగాపురం పోలీసులు అరెస్టు చేశారు. తన కుమార్తె, చిన్న కుమారుడికి తన వద్ద ఉన్న డబ్బులు ఇస్తున్నట్లు, పెద్దకుమారుడికి కుటుంబానికి డబ్బులు ఇవ్వడం లేదని అప్పయమ్మపై కక్ష పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో పెద్దకుమారుడు కొడుకు అయిన గౌరి ఈ నెల 12న మద్యం మత్తులో నాన్నమ్మను బైక్ ఫైనాన్సు కట్టేందుకు డబ్బులు అడిగాడు. ఆమె నిరాకరించడంతో ముఖంపై తలగడ అదిమి హత్య చేసి ఆమె ఒంటిపై ఉన్న ఆభరణాలను దొంగిలించాడు. అనంతరం మృతదేహాన్ని ఓ బావి వద్దకు తీసుకెళ్లి పడేశాడు. కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసులు హత్య కేసును ఛేదించారని ఎస్‌పి తెలిపారు. కేసులు క్రియాశీలకంగా పనిచేసిన డిఎస్‌పి గోవిందరావు, సిఐ కె.దుర్గాప్రసాద్, ఎస్ఐలు పి.పాపారావు, కె.లక్ష్మణరావు, ఎఎస్ఐ గౌరికి, ఇతర పోలీసు అధికారులను ఎస్‌పి అభినందించి వారికి నగదు రివార్డులు అందజేశారు.

నాయకత్వం ఆదేశాలు శిరసావహిస్తా

టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి

ప్రజాశక్తి-విజయనగరకోట

టిడిపి అధినాయకుల చంద్రబాబునాయుడు, లోకేష్ ఆదేశాలను శిరసావహిస్తానని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. రెండోసారి అధ్యక్షులుగా నియమితులైన సందర్భంగా నాగార్జున .. జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎంపికైన ప్రసాదుల లక్ష్మీవరప్రసాద్‌తో కలసి పైడితల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఇంటికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం అశోక్ బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ తమ ఎదుగుదలకు జిల్లా అధినాయకులు, కేంద్రమాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజే కారణమన్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులకు పట్టణ పార్టీ అధ్యక్షులు గంటా రవి, ప్రధాన కార్యదర్శి కోదండరాం, మండల పార్టీ అధ్యక్షులు గంటా పోలినాయుడు, ప్రధాన కార్యదర్శి పాశి అప్పలనాయుడు, పినవేమలి, రాకోడు ఎంపిటిసి వేచలపు శ్రీనివాసరావు, నియోజకవర్గ నాయకులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి సత్కరించారు.



నాగార్జున, వరప్రసాద్‌ను సత్కరిస్తున్న టిడిపి నాయకులు

పిజిఆర్ఎస్‌కు 257 వినతులు

పరిష్కారంలో ఆలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదు : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కు విశేష స్పందన లభించింది. కలెక్టర్‌తో పాటు జాయింటు కలక్టరు, జిల్లా రెవెన్యూ అధికారి, స్పెషల్ డిప్యూటి కలక్టర్లు తదితరులు ఫిర్యాదుదారుల నుండి 257 వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన వినతులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వినతుల పరిష్కారంలో అధికారులు ఆలసత్యం ప్రదర్శిస్తే సహించేది లేదన్నారు. రెవెన్యు శాఖకు సంబంధించి 70 వినతులు, డిఆర్‌డిఎ సంబంధించి 82 వినతులు, గ్రామ సచివాలయం శాఖకు సంబందించి 6 వినతులు, మున్సిపల్ శాఖ-7, విద్యా శాఖ 5, జిల్లా పంచాయతీ శాఖ-28, విద్యుత్ శాఖ-4, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ-16, హౌసింగు-4, ఇతర శాఖ నుండి 35 వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ టోల్ ఫ్రీ నెంబర్ 1100 పై ప్రజలకు అవగాహన కలిగించాలని తెలిపారు. ఈ నెంబర్ కు అందిన కాల్స్ కు కూడా సంబంధిత అధికారి సమాధానం సరైన రీతిలో అందజేయాలన్నారు. కార్యక్రమంలో జాయింటు కలెక్టర్ సేతు మాధవన్, డిఆర్ఒ మురళి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు డి.వెంకటేశ్వర రావు, రాజేశ్వరి, ప్రమీల గాంధీ, బి. శాంతి, కళావతి , సర్వే శాఖ ఎడి ఆర్.విజయకుమార్, సిపిఒ బాలజి, జిల్లా పరిషత్ సిఇఒ బి.వి.సత్యనారాయణ, డిఇఒ మాణిక్యంయుడు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

గుర్లగెడ్డ జలాశయాన్ని పూర్తి చేయాలి

అసంపూర్తిగా ఉన్న గుర్ల గెడ్డ జలాశయానికి అటవీ అనుమతులు ఇచ్చి నిధులు మంజూరు చేసి పూర్తి చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో అధికారులకు గుర్లగెడ్డ ప్రాజెక్టు సాధన కమిటీ ఆధ్వర్యాన వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జలాశయం బండ్, కాలువలను రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమిస్తున్నారని, వెంటనే అధికారులు స్పందించి ఆక్రమణలను ఆపాలని కోరారు. జలాశయంలో నీరు మట్టికట్ట మళ్లించడం వల్ల అటవీశాఖ అనుమతులు రాకపోవడంతో ప్రాజెక్టు నిరుపయోగంగా ఉందన్నారు. జలాశయం కుడి, ఎడమ కాలువలను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలన్నారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు, కమిటీ నాయకులు రెడ్డి రాజప్పలనాయుడు, గంద్రేటి లక్ష్మణరావు, పి.కృష్ణమూర్తి, గొర్లె సన్యాసిరావు, ఎస్.అప్పలనాయుడు, పి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న గుర్లగెడ్డ ప్రాజెక్టు సాధన కమిటీ సభ్యులు

నాయీ బ్రాహ్మణుల నిరసన

విజయనగరంటౌన్ : నాయీ బ్రాహ్మణులను కులం పేరుతో పిలిచిన వారిపై జీవో నెంబర్ 50 ద్వారా చర్యలు తీసుకోవాలని కలెక్టరేట్ వద్ద నాయీ బ్రాహ్మణ సంఘం (జెఎసి) ఆధ్వర్యాన సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు టివి దుర్గారావు, దిమిలి పైడిరాజు, రామేశ్వరపు అప్పారావు మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులు కులవివక్షకు గురవు తున్నారని అన్నారు. అధికార, ప్రతి పక్ష నాయకులు, సినిమా ప్రముఖులు, టివి యాంకర్లతో పాటు టివి కామెడీ కార్యక్రమాలలో తమను, తమ మహిళలను కులం పేరుతో, సామెతల పేరుతో అవమానపరుస్తూ మా మనోభావాలు దెబ్బతీస్తున్నారన్నారు, ప్రభుత్వం కులం పేరుతో పిలిచిన వారిపై చర్యలు తీసుకునే విధంగా జివో నెంబర్ 50 విడుదల చేసిందని, ఆ జీవో ద్వారా తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చోడి ఆదినారాయణ, పి, వెంకటరమణ, ఐ.సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కార్యకర్తల సేవలు వెలకట్టలేనివి

● 169 మందికి కార్యకర్తలుగా ప్రమోషన్ ● 2608 మందికి 5జి మొబైల్స్ పంపిణీ

ప్రజాశక్తి-కంటోన్మెంట్

చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు అంగన్వాడీ కార్యకర్తలు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని ఉపాధ్యాయ ఎంఎల్‌సి గాదె శ్రీనువాసులనాయుడు కొనియాడారు. స్త్రీశక్తికి ప్రతిరూపంగా వారు తమ విధుల్లో మనసుపెట్టి పనిచేస్తున్నారని పేర్కొన్నారు. బేటి బచావో-బేటి పడావో కార్యక్రమంలో భాగంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం ప్రారంభించారు. బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దే లక్ష్యంతో చేపట్టిన '100 రోజుల జాతీయ ప్రచార కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 2499 అంగన్వాడీ కేంద్రాల్లో ముస్తాబు కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లాలోని 169 మినీ అంగన్‌వాడీ కార్యకర్తలకు మెయిన్ అంగన్‌వాడీ కార్యకర్తలుగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు అందజేశారు. అంగన్‌వాడీ సేవలను మరింత బలోపేతం చేసేందుకు, డిజిటల్ రిపోర్టింగ్‌ను వేగవంతం చేసేందుకు మొత్తం 2608 మంది అంగన్వాడీ కార్యకర్తలకు అత్యాధునిక 5జి మొబైల్ ఫోన్లు మంజూరు కాగా, తొలివిడతగా 500 ఫోన్లను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ చిన్నారులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే గురుతర బాధ్యత అంగన్వాడీ కార్యకర్తలపై ఉందన్నారు. వారే విద్యార్థులకు తొలిగురువులుగా వ్యవహరిస్తున్నా రని చెప్పారు. కార్యకర్తల పేరును అంగన్‌వాడీ టీచర్లుగా మార్చేందుకు, వారి జీతాలను పెంచేందుకు, డిఎస్‌సిలో వెయిటేజి మార్కులు ఇచ్చేందుకు తమవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మరో ముఖ్యఅతిధి, ఎంఎల్‌సి ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ, బాల్య వివాహాలు లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై పని చేయాలని, ముఖ్యంగా అంగన్‌వాడీ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రజలను చైతన్యవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, బాల్య వివాహాల వల్ల కలిగే చట్టపరమైన పరిణామాల గురించి వివరించారు. అవసరమైనవారికి న్యాయ సహాయం, సహకారం, సలహాల కోసం టోల్ ఫ్రీ నెంబరు 15100 ను ఏర్పాటు చేయడం జరిగిందని, దీనిని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిడబ్ల్యుసి ఛైర్‌పర్సన్ జి.హిమబిందు, డిఇఒ యు.మాణిక్యం నాయుడు, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.విమలారాణి, యూత్ క్లబ్ ఎన్జీవో జిల్లా అధ్యక్షురాలు ఝాన్సీ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

అంగన్వాడీలకు సెల్‌ఫోన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీలు

ఎమ్మెల్యే, ఎంపిపి భర్తల మధ్య వివాదం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

పూసపాటిరేగ ఎంపిపి నిధులు వినియోగంపై నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి భర్త లోకం ప్రసాద్‌కు పూసపాటిరేగ ఎంపిపి మహంతి కళ్యాణి భర్త మహంతి శ్రీనివాసరావుకు మధ్య తీవ్ర వాగ్వివాదం చోటు చేసుకుంది. సోమవారం పూసపాటిరేగ ఎంపిడిఒ రాధికతో మాట్లాడేందుకు ఎమ్మెల్యే భర్త ఎంపిడిఒ కార్యాలయానికి వచ్చారు. అనంతరం ఎంపిపితో మాట్లాడేందుకు చాంబర్‌లోకి వెళ్లారు. ఎంపిపి లేరని ఆమె భర్త శ్రీనివాసరావు తెలిపారు. ఎంపిపి నిధులు గ్రామాల్లో సక్రమంగా ఇవ్వలేదని లోకం ప్రసాద్ అడగడంతో ఇరువురు మధ్య వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. మండలంలోని ప్రతి పంచాయతీకి నిధులు ఇచ్చామని, మీరు వస్తే ప్రతి గ్రామంలో చూపిస్తామని ఎంపిపి భర్త తెలిపారు. అవసరమైన అభివృద్ధిని వదిలేసి శ్మశాన వాటికకు నిదులు వెచ్చించడం ఏమిటని ఎమ్మెల్యే భర్త ప్రశ్నించారు. శ్మశానం నిర్మాణం నాలుగేళ్లపాటు జరిగినా ఎవరూ అభ్యంతరాలు చెప్పలేదని, ఓ సర్పంచ్ పేరు శిలాఫలకంపై వేయలేదన్న దురుద్దేశంతో ఈ శ్మశాన రాజకీయానికి తెరతీయడం నిజం కాదా అని ఎంపిపి భర్త అసహనం వ్యక్తం చేశారు. చెప్పిన మాటలు విని శ్మశాన వాటిక నిర్మాణాన్ని రాజకీయం చేయడం మీకు తగదని, ఇది రెల్లివలస ప్రజలును అవమానించడమేనని అన్నారు. ఇతర గ్రామాలకు శ్మశానాలకు రోడ్లు లేవని, మీరు ఒక గ్రామానికి అన్ని నిధులు ఎలా వెచ్చించారని, ప్రయివేటు లే అవుట్‌లకు రహదార్లు వేయడం పద్ధతేనా అంటూ ప్రశ్నించారు. మండలంలో శ్మశానాలు, లింక్ రోడ్లు అభివృద్ధి చేసామని, మా పాలనలో చేసిన అభివృద్ధిని మేము చూపించగలమని ఎంపిపి భర్త చెప్పడంతో అందుకే మిమ్మల్ని 11 సీట్లుకు ప్రజలు దించేసారని ప్రసాద్ ఎద్దేవా చేశారు. దీంతో ఎంపిపి భర్త అసహనంతో మీరు ఈ నియోజకవర్గంలో మరోసారి గెలిచే అవకాశం ఉందా అని ఛాలంజ్ చేస్తున్నానని అన్నారు. మాటామాటా పెరగడంతో ఎమ్మెల్యే భర్త అసహనంతో బయటకు వెళ్లిపోయారు.

వాగ్వివాదానికి దిగిన లోకం ప్రసాద్, మహంతి శ్రీనివాసరావు

శత్రుచర్లకు బేబినాయన పరామర్శ

ప్రజాశక్తి-బొబ్బిలి

మాజీమంత్రి శత్రుచర్ల విజయరామరాజును బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన పరామర్శించారు. అనారోగ్య కారణాలతో విశాఖలోని తన నివాసంలో చికిత్స పొందుతున్న శత్రుచర్లను సోమవారం బేబినాయన పరామర్శించి, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట టిడిపి సీనియర్ నాయకులు మజ్జి కృష్ణమోహన్ ఉన్నారు.

పరిహారం ఇప్పించాలని వినతి

శృంగవరపుకోట : పట్టణంలో పుణ్యగిరి రోడ్డులో బిసి కాలనీ కోసం 2007లో అప్పటి ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టిల నుంచి భూమి సేకరించి, నేటికీ పరిహారం చెల్లించలేదని సామాజిక కార్యకర్త డి.సూర్యారావు.. కలెక్టరేట్‌లో నిర్వహించిన పిజిఆర్‌ఎస్‌లో కలెక్టర్ రామసుందర్‌రెడ్డికి వినతి అందించారు. నష్టపరిహారం ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గిరిజన ఆశ్రమ పాఠశాల భవనానికి స్థలాన్ని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు సామగ్రి వితరణ

ప్రజాశక్తి-వేపాడ

మారిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వేపాడ గ్రామానికి చెందిన కొలుపూరి ప్రసాద్, సూర్య తమ తండ్రి కొలుపూరి రాము జ్ఞాపకార్థం రూ.5 వేలు విలువైన సామగ్రిని సోమవారం వితరణ చేశారు.

గిరిజనులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-మెంటాడ

ఎఎస్ఆర్ జిల్లా అనంతగిరి మండలం రొంపిల్లి పంచాయతీ మధుర గిరిజన గ్రామం మంగళగుడ్డపేటలో సోమవారం అమ్మ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యాన గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు సురేష్, గుర్ల సర్పంచ్ ప్రతినిధి బొడ్డల జగదీష్, గండ్రేటి ఈశ్వరరావు, పి.పాపారావు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో మాట్లాడుతున్న సర్పంచ్ అప్పలనాయుడు

కిర్తిబర్తిలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-గంట్యాడ

మండలంలోని కిర్తిబర్తి గ్రామంలో సోమవారం ఏర్పాటుచేసిన మెగా వైద్య శిబిరాన్ని సర్పంచ్ ఆర్‌సిహెచ్ అప్పలనాయుడు ప్రారంభించారు. నేచర్ స్వచ్ఛంద సంస్థ, ఎస్‌బిఐ జనరల్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యాన ఈ శిబిరం ఏర్పాటుచేశారు. 192 మందికి వైద్యులు ఎస్.శాంతి పరీక్షలు చేసి, మందులు అందజేశారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ బంగారుబాబు పాల్గొన్నారు.

బీచ్ వాలీబాల్ పోటీల్లో బంగారు పతకం

ప్రజాశక్తి- నెల్లిమర్ల

బాపట్ల జిల్లా సూర్యలంకలో జరిగిన రాష్ట్ర స్థాయి బీచ్ వాలీబాల్ పోటీల్లో అలుగోలు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి బి. గణేష్ బంగారు పతకం సాధించారు. ఈ సందర్భంగా గణేష్‌ను హెచ్‌ఎం కస్తూరి, పీడీలు జి.ధర్మారావు, బి.మహేశ్వరరావు, సెక్రటరీ నీలకంఠం, లక్ష్మణరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి- రాజాం

మండలంలోని పొగిరి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థి గౌతమ్ రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు పిఇటిలు సంతోషిమాత, త్రినాధరావు తెలిపారు. శ్రీకాకుళంలో ఆదివారం జరిగిన జిల్లా స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో గౌతమ్ పాల్గొని ప్రతిభ చూపడంతో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడని తెలిపారు. ఈ సందర్భంగా గౌతమ్‌ఉ పాఠశాల హెచ్‌ఎం పద్మావతి, ఉపాధ్యాయులు అభినందించారు.

సిఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న రామ్‌మల్లిక్‌నాయుడు

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి- చీపురుపల్లి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలు ఎక్కడికీ తిరగకుండా ప్రజల ఇంటి వద్దకే పాలనను అందిస్తున్నామని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు అన్నారు. సోమవారం పట్టణంలో పలువురుకు ఆయన సిఎం సహాయ నిధి చెక్కులను అందించారు. ఈ సందర్భంగా వైశ్యరాజు సాంబమూర్తికి రూ.35వేలు, గవిడి లక్ష్మణనాయుడు రూ.57వేలు, శనపతి లక్ష్మి రూ.30వేలు, శంకరావుపు భారతికి రూ.30వేలు చెక్కులను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. ఈ కార్యక్రంలో టిడిపి నాయకులు రౌతు కామనాయుడు, గవిడి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దళిత కాలనీలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జరజాపు పేట దళిత కాలనీలో సోమవారం క్రిస్మస్‌ను పురస్కరించుకుని స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. హార్ట్ బాప్టిస్ట్ చర్చి, సాధన యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 15మంది దాతలు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో చర్చి ఫాస్టర్ మాత కిరణ్ కుమార్, మాత కిషోర్, సాధన యువజన సంఘం అధ్యక్షులు పోలుబోతు దుర్గాప్రసాద్ రావు, సభ్యులు తుమ్మ అశోక్, పసుమర్తి వెంకటరమణ, పెదగాడ నవీన్, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది అప్పల నాయుడు పాల్గొన్నారు.

దీక్షితకు ప్రథమ స్థానం

గంట్యాడ : జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో తెలుగు విభాగంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో లక్కిడాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి వాసిరెడ్డి దీక్షిత ప్రథమ స్థానం సాధించింది. దీంతో రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. విద్యార్థిని హెచ్‌ఎం విజయలక్ష్మి, గైడ్ టీచర్ ఎం.హరికృష్ణారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

కోర్టు భవన నిర్మాణానికి రూ.8.50 కోట్లు విడుదల

శృంగవరపుకోట : శృంగవరపుకోట సివిల్ జడ్జి కోర్టు నిర్మాణానికి రూ.8.50 కోట్లు ప్రభుత్వం విడుదల చేసినట్లు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. దీంతో సిఎం చంద్రబాబుకు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు.

జిల్లా యువతకు ఉపాధి కల్పించాలి

ప్రజాశక్తి- భోగాపురం

భోగాపురం ఎయిర్ పోర్టులో జిల్లా యువతకు ఉపాధి కల్పించాలని లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు బీశెట్టి బాబ్జి కోరారు. సోమవారం భోగాపురంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ విమానాశ్రయంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 30వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించవచ్చునని, అత్యధికంగా డ్రైవర్లు, పెయింటర్లు, ప్లంబర్లు, గార్డెనింగ్, హౌస్ కీపింగ్‌తో పాటు అనేక విభాగాల్లో ఉపాధి అవకాశాలున్నాయని వాటిన్నింటిలో జిల్లా యువతకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

ఘనంగా గణిత దినోత్సవం

ప్రజాశక్తి-వేపాడ

ప్రముఖ గణిత మేధావి రామానుజన్ జయంతి సందర్భంగా గణిత దినోత్సవాన్ని జిల్లాలోని పలు పాఠశాలల్లో సోమవారం ఘనంగా నిర్వహిచారు.

బక్కునాయుడుపేట ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపల్ రావాడ ఈశ్వరరావు, సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు బి.పి.ఎ.రాజు ఆధ్వర్యాన గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు రామానుజన్ సంఖ్య ఆకృతిలో మానవ హారం ఏర్పాటు చేశారు. సోంపురంలో గణిత ఉపాధ్యాయులు పి.రమేష్ నాయుడు, బంటు శ్రీనివాసరావు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బి.సత్యారావు 150 మంది విద్యార్థులకు ఎక్కాల పుస్తకాలు, పెన్నులు అందజేశారు. వేపాడ శాఖా గ్రంథాలయంలో క్విజ్ పోటీలు నిర్వహించారు.

రామభద్రపురం : స్థానిక హైస్కూల్లో హెచ్‌ఎం గోపాలనాయుడు ఆధ్వర్యాన గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. 200కు పైగా ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు.

శృంగవరపుకోట : కొట్టాం హైస్కూల్లో గణిత దినోత్సవ వేడుకలను ఇన్‌ఛార్జి హెచ్‌ఎం రహీం షేక్ లాల్ ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన గణిత ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి.

రేగిడి : మండలంలోని కొండవలస పాఠశాలలో సోమవారం గణిత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎంఇఒ ఎం వరప్రసాదరావు విద్యార్థులు వేసిన గణిత చార్టులను పరిశీలించి అభినందించారు. వీరితోపాటు ఉపాధ్యాయులు చుక్కా వైకుంఠ రావు ఉన్నారు.

వేపాడ : రామానుజం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మోడల్ స్కూలు ఉపాధ్యాయులు, విద్యార్థులు

నెల్లిమర్ల: జరజాపుపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని హెచ్‌ఎం ఎస్.కామేశ్వరి అధ్యక్షతన, గణిత ఉపాధ్యాయులు శివుకు బంగారయ్య, రమణ ఆధ్వర్యంలో విద్యార్థులకు తరగతుల వారీగా మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్, క్విజ్ పోటీలను నిర్వహించారు. విద్యార్థులు ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. పారసాం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు పాల్గొని గణిత ఉపాధ్యాయులను సత్కరించారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను పరిశీలించి అభినందించారు.

రాజాం: మండలంలోని పొగిరి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో గణిత దినోత్సవం సందర్భంగా రామానుజన్ చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళులర్పించారు. పట్టణంలని ది సన్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ వై.భారతి ఆధ్వర్యంలో గణిత ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గణిత ప్రాముఖ్యత అనే అంశంపై స్కిట్ ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దెంకాడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ హిమగాయత్రి రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గణిత అధ్యాపకులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: మండలంలోని ఎమ్‌ఆర్ అగ్రహారం ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం రామానుజన్ మండల స్థాయి టాలెంట్ టెస్ట్, క్విజ్ పోటీలను ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం దార రేవతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఇఒలు శాంతికుమారి, భాస్కరరావులు పోటీలను పర్యవేక్షించారు.

విజయనగరం టౌన్ : స్థానిక గురజాడ పాఠశాలలో విద్యార్థులు వివిధ రకాల 100కు పైగా మ్యాథ్స్ ప్రాజెక్టులు, పజిల్స్‌తో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాథ్స్ ప్రొఫెసర్ హేమ సుందర్రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మ్యాథ్స్ పట్ల ఆసక్తిని ఏ విధంగా పెంపొందించాలో వివరించారు. పాఠశాల డైరెక్టర్ ఎంవిఆర్ కృష్ణాజి విద్యార్థులకు రామానుజన్ గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎం.స్వరూప, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పూడి శేఖర్, మ్యాథమెటిక్స్ ఉపాధ్యాయులు కె.సింహాచలం, ఒ.మహేష్ ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గణిత దినోత్సవం సందర్భంగా నగరంలోని రాజీవ్ నగర్ కాలనీ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు రామానుజం సంఖ్యను అంకెలు రూపంలో వేసి ఆయన జయంతి నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు హరీష్ ఆధ్వర్యాన ఈ కార్యక్రమం చేపట్టారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజీవ్‌నగర్ మున్సిపల్ పాఠశాలలో రామానుజం సంఖ్య ఆకారంలో విద్యార్థులు

విజయనగరంకోట : రామానుజన్ జయంతిని గాజులరేగలోని నారాయణ పబ్లిక్ స్కూలులో ఘనంగా నిర్వహించారు. రామానుజన్ చిత్రపటానికి స్కూలు కరస్పాండెంట్ మొయిద నారాయణరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 20వ శతాబ్ధంలో గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ ఒకరని అన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

డెంకాడ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోప్రముఖ గణిత శాస్త్ర వేత్త రామానుజన్ జయంతి, జాతీయ గణిత దినోత్సవం ఘనంగా గా నిర్వహించారు. ప్రిన్సిపాల్ హిమగాయత్రి, అధ్యాపక సిబ్బంది రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రామానుజన్ గణితశాస్త్రానికి అందించిన సేవలను వివరించారు. అనంతరం గణిత అధ్యాపకులను సత్కరించారు.

దెంకాడ : జూనియర్ కళాశాలలో రామానుజం చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రిన్సిపాల్ హిమగాయత్రి

సిఐటియు బహిరంగ సభకు తరలిరండి

ప్రజాశక్తి- సంతకవిటి

ఈ నెల 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరుగనున్న సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.సురేష్ తెలిపారు. ఈ మేరకు మండల కేంద్రంలో సోమవారం అఖిల భారత మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి ప్రతినిధులు ఈ మహాసభలకు హాజరవుతారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్, కార్మిక హక్కులను దెబ్బతీస్తాయని విమర్శించారు. కార్మిక సంఘాలను సంప్రదించకుండా విధానాలు ప్రకటించడం ప్రజాస్వామ్య విరుద్ధమని అన్నారు. జాతీయ మహాసభల ముగింపు సందర్భంగా జనవరి 4న విశాఖలో భారీ కార్మిక ప్రదర్శన తోపాటు, భారీ బహిరంగ సభ నిర్వహిస్తా మన్నారు. ఈ కార్యక్రమానికి కార్మికులంతాహాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు రాములు, శశిభూషణ్‌రావు, లక్ష్మణ్, కామయ్య, చిట్టిబాబు పాల్గొన్నారు.

మహాసభ ప్రచార కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు సురేష్, కార్మికులు

క్రికెట్ లో విజేతగా నిలిచిన బొబ్బిలి డివిజన్ జట్టు

ముగిసిన జిల్లా స్థాయి టీచర్ల టోర్నమెంట్

ప్రజాశక్తి- నెల్లిమర్ల

సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో నిర్వహి స్తున్న జిల్లా స్థాయి టీచర్ల క్రికెట్, త్రోబాల్ టోర్నమెంట్ పోటీలు సోమవారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. జిల్లా స్థాయి క్రికెట్ ఫైనల్స్‌లో విజయనగరం డివిజన్ జట్టుపై బొబ్బిలి డివిజన్ జట్టు విజయం సాధించింది. మహిళా ఉపాధ్యాయులకు నిర్వహించిన త్రోబాల్ పోటీల్లో విజయనగరం జట్టు మొదటి స్థానం, చీపురుపల్లి డిజవిజన్ జట్టు ద్వితీయ, బొబ్బిలి డివిజన్ తృతీయ స్థానంలో నిలిచాయి. త్రోబాల్ విజేతలకు ఎంఇఒ త్రినాధ్ చేతులు మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. వీరంతా రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ కె.గోపాల్ పిఇటి అసోసియేషన్ కార్యదర్శి ఎన్.వెంకట్‌నాయుడు, స్పోర్ట్స్ కోఆర్డినేటర్లు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో జాతీయ వినియోగదారుల దినోత్సవం

ప్రజాశక్తి- నెల్లిమర్ల

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వాణిజ్య విభాగం అధిపతి ఎటిఎస్ నాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జిల్లా కన్స్యూమర్ కమిషన్ మెంబర్, జడ్జి బి.శ్రీదేవి హాజరై మాట్లాడారు. డిజిటల్ మోసాలు గురించి, డిజటిల్ న్యాయపాలన ద్వారా సమర్థ సత్వర పరిష్కారం గురించి, వినియోగదారుల హక్కుల గురించి విద్యార్థులకు వివరించారు. వస్తువలకు ఐఎస్ఐ మార్కు ఉండాలని, బంగారానికి హాల్ మార్క్ ఉండాలని, ఆహార ఉత్పత్తులకు ఎఫ్‌పిఒ మార్క్ ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కందుల రేఖ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి. అప్పారావు, ఐక్య సి కోఆర్డినేటర్ డాక్టర్ జివిఎస్ జైపాల్‌రావు, అకడమిక్ కోఆర్డినేటర్ పి. రూపవాణి, అధ్యాపకులు లక్ష్మణరావు, కస్తూరి, ఎం.రమణ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలి : ఎస్‌పి

ప్రజాశక్తి -కంటోన్మెంట్

ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు ఎస్‌పి ఎఆర్ దామోదర్ సూచించారు. సోమవారం పిజిఆర్‌ఎస్‌లో 27 వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి.సౌమ్యలత, డిసిఆర్ సిఐ కె.కుమార స్వామి, ఎస్‌బి సిఐ ఎవి లీలారావు, ఎస్‌ఐలు రాజేష్, ప్రభావతి సిబ్బంది పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య

ఫిర్యాదులు తక్షణమే పరిష్కరించాలి : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజా ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించి పుర సేవలను మరింత విస్తృత పరచనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. సోమవారం కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 9 ఫిర్యాదులు అందాయి. వాటిని స్వీకరించిన కమిషనర్ ఫిర్యాదుల పరిష్కారానికై సంబంధిత అధికారులకు ఆదేశించారు. నిరంతరం క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తూ ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని కూడా పరిష్కరిస్తున్నామన్నారు. సిబ్బంది దృష్టికి వచ్చిన ఫిర్యాదులను కూడా వెంటనే పరిష్కారం దిశగా చొరవ చూపాలని ఆదేశిస్తున్నామని చెప్పారు.

పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించబోం

క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా పలు ప్రాంతాలలో పర్యటించిన ఆయన పారిశుధ్య పనితీరు ను గమనించారు. పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించబోమని సూచించారు. కాలువల్లో చెత్తాచెదారాలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు.

చిన్నారులకు పోలియో చుక్కలు

ప్రజాశక్తి-బాడంగి

మండలంలోని ఆకులకట్ట గ్రామంలో కొండ ప్రాంతంలో హెల్త్ సూపర్‌వైజర్ తెంటు నిర్మల, ఎంఎల్‌హెచ్‌పి జానకి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. సోమ, మంగళవారాల్లో ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేస్తున్నారు.

కార్మికుడి కుటుంబానికి పెన్షన్ పత్రాలు అందజేత

ప్రజాశక్తి- కంటోన్మెంట్

ఇటీవల మృతి చెందిన కార్మికుని కుటుంబానికి సోమవారం విజయనగరం కార్మిక రాజ్య బీమా సంస్థ కార్యాలయం ద్వారా సోమవారం ఇఎస్-ఎస్ బ్రాంచ్ మేనేజర్ జీవరత్న చేతుల మీదుగా పింఛను పత్రాలు అందజేశారు. బొబ్బిలి గ్రోత్ సెంటర్ లో గల బెర్రీ ఎల్లోయిస్ లిమిటెడ్ కంపెనీలో కాంట్రాక్ట్ కార్మికునిగా పని చేస్తూ ఈ ఏడాది జూన్ 9న ఝార్ఖండ్‌కు చెందిన దిల్దార్ అన్సారీ అనే కార్మికుడు ప్రమాదవశాత్తు మృతి చెందాడు. కార్మికుని తల్లిదండ్రులకు నెలకు రూ.6వేలు పెన్షన్ చొప్పున రూ.35వేలు వచ్చాయని మేనేజర్ జీవరత్న తెలిపారు. ఆ నగదుకు సంబంధించిన చెక్కును అందజేశామన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, ప్రతినిధులు పాల్గొన్నారు.

తెంటు లక్ష్మునాయుడును పరామర్శిస్తున్న మంత్రి గుమ్మడి సంధ్యారాణి

'తెంటు'కు మంత్రి సంధ్యారాణి పరామర్శ

ప్రజాశక్తి-బాడంగి

బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు తల్లి సత్యవతమ్మ ఇటీవల మరణించడంతో సోమవారం ఆయన్ను గిరిజన సంక్షేమ శాఖ మంత్రి జి.సంధ్యారాణి పరామర్శించారు. మండలంలోని ముగడ గ్రామంలో లక్ష్మునాయుడు నివాసానికి వెళ్లి సత్యవతమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. లక్ష్మునాయుడుకు సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్ఆర్ షాపింగ్‌మాల్ ప్రారంభం

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలో నూతనంగా ఏర్పాటుచేసిన ఎస్ఆర్ షాపింగ్‌మాల్‌ను మాజీమంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు, మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు, టిబిఆర్ సంస్థల అధినేత తూముల భాస్కరరావు, మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు ప్రారంభించారు. బొబ్బిలి ప్రాంత ప్రజలకు నాణ్యమైన వస్త్రాలను తక్కువ ధరలకు అందించేందుకు షాపింగ్ మాల్ ప్రారంభించడం ఆనందంగా ఉందని వారు అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, టిడిపి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

అలరించిన అనసూయ

బొబ్బిలిలో సినీ నటి అనసూయ అలరించారు. ఎస్ఆర్ షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవానికి హాజరైన అనసూయ సినిమా పాటలకు స్టెప్పులు వేసి అలరించారు. అనసూయను చూసేందుకు జనం పోటెత్తారు. బలిజిపేట రోడ్డులో రాకపోకలను పోలీసులు నిలిపేశారు.

ఎస్ఆర్ షాపింగ్‌మాల్‌ను ప్రారంభిస్తున్నమాజీ మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు

ఎంపిడిఒ రాధికను ప్రశిస్తున్న తాళ్లపేట గ్రామస్తులు

ప్రత్యేక పంచాయతీ ఇవ్వాలి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

తమకు ప్రత్యేక పంచాయతీ కావాలంటూ మండలంలోని వెంపడాం పంచాయతీకి చెందిన తాళ్లపేట గ్రామస్తులు సోమవారం ఎంపిడిఒ కార్యాలయాన్ని ముట్టడించారు. ఎంపిడిఒ రాధికతో పాటు గ్రామ కార్యదర్శి సంతోషిని చుట్టుముట్టి తమకు తీర్మానం ఎందుకు ఇవ్వడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్పంచ్ పిన్నింటి కుమార్ గ్రామ సభ పెట్టనీయకుండా, తీర్మానం ఇవ్వకుండా అడ్డుపడుతున్నారని ఎంపిడిఒకు వివరించారు. గ్రామ సభ పెట్టకుండా ప్రత్యేక పంచాయతీకి వ్యతిరేకంగా తీర్మానం ఎందుకు చేసారో చెప్పాలని కార్యదర్శి సంతోషిని చుట్టు ముట్టారు. గ్రామ సభ పెట్టేందుకు సర్పంచ్ అవకాశం ఇవ్వడం లేదని కార్యదర్శి ఎంపిడిఒతో తెలిపారు. వెంటనే ఈ విషయం డిపిఒకు తెలియజేస్తామని, గ్రామసభ ఏర్పాటు చేస్తామని ఎంపిడిఒ తెలిపారు. ఈ సందర్భంగా తాళ్లపేట నాయకుడు వాళ్లె హక్కునాయుడు, వెంపడాం మాజీ సర్పంచ్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజలంతా ప్రత్యేక పంచాయతీ కోరుకుంటున్నారన్నారు. వెంటనే అధికార్లు స్పందించి గ్రామసభ పెట్టి తీర్మానం చేయాలని ఎంపిడిఒను కోరారు.

ప్రకటన

మహారాజశ్రీ విజయనగరం 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జివారు (ఎక్సైజు కోర్టు) వారికోర్టులో

OS. 500/2021

శ్రీ నమ్మి రామకృష్ణ ....వాది
యెదిరి
శ్రీమతి మేడపాటి (కొల్లూరు) సరోజిని వగైరాలు ....ప్రతివాదులు

టు

1) శ్రీమతి మేడపాటి (కొల్లూరు) సరోజిని W/o లేటు M.V.S.శర్మ, డోర్ నెంబరు: 20.8.1A, ఆనందపేట, కానుకుర్తివారి వీధి, విజయనగరం 535002
2) శ్రీమతి కాకర్ల (మేడపాటి) పావని W/o సుబ్రహ్మణ్య శర్మ, డిటో చిరునామా.
3) శ్రీ మేడపాటి ఫణికుమార్ S/o లేటు M.V.S.శర్మ, ఉద్యోగి, డిటో చిరునామా

దావా పరిహారం నిమిత్తం అనగా సదరు దావాలో వివరించిన సొమ్ము రాబట్టే నిమిత్తం మీపైని మరియు ఇందలి 4వ ప్రతివాదిపైని ఇందలి వాదిగారు దావా దాఖలు చేసియున్నందున సదరు పై నెంబరు దావాలో మీరు స్వయముగా కాని వకీలు ద్వారా గాని **తే 02-01-2026వ తేదీన ఉదయం గం॥ 10-30 ని॥లకు** పై కోర్టువారి యెదుట హాజరయ్యి మీ వాదనకు ఆధారముగా యున్న అన్ని దస్తావేజులతో మీ యొక్క స్టేట్‌మెంటుతో సహా హాజరు అయ్యి మీరు వాదించుకోవలెను. అట్లు కాని యెడల సదరు దావాను మీ పరోక్షమందు విచారించి తీర్మానించెదరని యిందు మూలముగా మీకు తెలియజేయడమైనది.

కాగా యిది శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు ప్రకటించడమైనది.

ఇట్లు
శ్రీ పోతుల రాంబాబు
వాది త॥ అడ్వకేట్,
విజయనగరం,
సెల్ : 9996458999